www.citytimesnews.com

# సిటీటైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 25 | సంచిక - 503 | హైదరాబాద్ | సోమవారం | తేదీ:17.11.2025 | పేజీలు 8 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## 19 లేదా 20 తేదీలలో నితీశ్ ప్రమాణ స్వీకారం



2లో..

## లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



2లో..

# లగ్గాలు తెగిపోతున్నయ్

- దాంపత్యాలు విచ్ఛిన్నమవుతున్నయ్
- నెలకు 250 విడాకులు కేసులు రిజిస్టర్
- ప్రధానంగా హైదరాబాద్‌లోనే అత్యధికం
- ప్రేమ పెండ్లి, కుదిర్చిన పెండ్లి అయినా..



హైదరాబాద్, సిటీ టైమ్స్ 2లో..

పెళ్లి అనేది ఇద్దరి మధ్య కేవలం ఒక ఒప్పందం కాదు.. జీవితాంతం ఒకరికి ఒకరు అండగా నిలవాలని ఇచ్చుకునే మాట. ప్రేమ, నమ్మకం, ఓపిక, అర్థం చేసుకోవడం అనే నాలుగు స్తంభాలపై నిలబడే ఈ బంధం, కాలం మారినా విలువ మాత్రం ఎప్పటికీ తగ్గదు. ఆనందాల్లో భాగస్వాములవడం ఎంత ముఖ్యమో, కష్టాల్లో చేతులు పట్టుకొని నిలవడం అంత కన్నా ముఖ్యమైనది. అందుకే మన పెద్దలు "పెళ్లి అనేది రెండు మనసులు, రెండు కుటుంబాలు కలిసే పవిత్రమైన అనుబంధం" అంటుంటారు.

# అమెరికాలో సామాన్లు పిరం

- సుంకాలు తొలగించిన ట్రంప్
- బెడిసి కొట్టిన సుంకాల పెంపు నిర్ణయం
- వెనక్కి తగ్గుతున్న డొనాల్డ్ ట్రంప్
- సుంకాల కారణంగా భారీగా పెరిగిన ధరలు

2లో..




వాషింగ్టన్, సిటీ టైమ్స్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాలు విధించి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో పలు వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఒత్తిడికి తలొగ్గిన ట్రంప్.. ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు.

## రాష్ట్రానికి ఫోర్త్ వండర్‌గా

# రామోజీఫిల్మ్‌సిటీ

- రామోజీ గ్రూప్ సంస్థలు రాష్ట్రానికి గర్వకారణం
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు అందజేత
- అవార్డుల ఆలోచన చేసిన కుటుంబీకులకు అభినందనీయం
- రామోజీ రావు స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి
- హైదరాబాద్ అంటే నాలుగు అద్భుతాలు
- చార్మినార్, గోల్కొండ, హైటెక్ సిటీ, రామోజీ ఫిల్మ్‌సిటీ

4లో..



హైదరాబాద్, సిటీ టైమ్స్
తెలంగాణ రాష్ట్రానికి ఫోర్త్ వండర్‌గా రామోజీఫిల్మ్‌సిటీ నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని పేర్కొన్నారు. ఆదివారం రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.
ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "రామోజీ అవార్డుల ఆలోచన చేసిన ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తున్నా. రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని వారు భావించడం ప్రశంసనీయం. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరమంటే నాలుగు అద్భుతాలు గుర్తొస్తాయి. అందులో మొదటిది ఛార్మినార్, రెండోది గోల్కొండ, మూడోది హైటెక్ సిటీ, నాలుగు.. రామోజీ ఫిల్మ్‌సిటీ. తెలుగు సినీ పరిశ్రమ నంది అవార్డులతో మొదలై.. ఆస్కార్ అవార్డుల వరకు ఎదిగిందంటే ఈ ప్రాంతంలో కట్టిన స్టూడియోలతో పాటు రామోజీ ఫిల్మ్ సిటీ కూడా ఎంతో తోడ్పాటునందించింది.



3లో..

## రామోజీ.. ప్రజల పక్షాన

# పోరాడిన యోధుడు

- అవార్డుల ఆలోచన ఎంతో ప్రశంసనీయం:చంద్రబాబు
- నమ్మిన సిద్ధాంతాల కోసం దేనినైనా వదులుకునేవారు

# ఐ బొమ్మ క్లోజ్

## రవితోనే వెబ్‌సైట్ క్లోజ్ చేయించిన పోలీసులు

- హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్
- ఫ్రాన్స్ నుంచి వచ్చిన రవి అదుపులోకి..
- రిమాండ్‌కు పంపిన నాంపల్లి కోర్టు

3లో..



# నవీన్ యాదవ్‌కు కీలక పదవి ఇచ్చే చాన్స్

- కేబినెట్ హోదా ఇచ్చే అవకాశం
- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే
- సిద్ధమైన సీఎం రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ విజేతకు జాక్‌పాట్

2లో..



హైదరాబాద్, సిటీ టైమ్స్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలకమైన పదవిని కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

## పాత్రికేయ రాజర్షి రామోజీరావు

- పాత్రికేయ రాజర్షి రామోజీరావు 3లో..

తెలుగు పోతే వెలుగు లేదు

వెంకయ్యనాయుడు వెల్లడి



## రాష్ట్ర బీజేపీకి కెప్టెన్ సంక్షోభం..

# కేడర్ గందరగోళం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు విఫలమా?
- బలమైన నాయకులున్నా నాయకత్వ లోపమే కారణమా?
- వెలువడుతున్న బీజేపీ నేతల అంతర్గత విశ్లేషణలు

3లో..




హైదరాబాద్, నవంబర్ 16 (సిటీటైమ్స్)
2024 పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 8 లోకసభ స్థానాలు సాధించిన బీజేపీ, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో డిపాజిట్ కూడా రాకపోవడం సాధారణ పరాజయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రైతుల సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు
- ప్రభుత్వానికి హరీశ్ సూచన
- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం
- వడ్ల విషయంలో

2లో..



మెదక్, సిటీ టైమ్స్

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటివరకు కొన్నది కేవలం ఐదారు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే అని తెలిపారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పి ఐదారు లక్షలకే పరిమితమైందని మండిపడ్డారు. కొన్న వాటికి కూడా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ధ్వజమెత్తారు.



### 19 లేదా 20 తేదీలలో

# నితీశ్ ప్రమాణ స్వీకారం

- కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై కూటమి ఫోకస్
- మరోసారి బిహార్ సీఎంగా నీతీశ్ కుమార్
- పట్నాలోని గాంధీ మైదానంలో విస్తృత ఏర్పాట్లు
- మోదీ సహా కేంద్ర మంత్రులు, ఎన్డీయే సీఎంలు హాజరు

**పాట్నా, సిటీ టైమ్స్**

ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు చర్యలు చేపట్టారు. మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని కూటమి వర్గాలు పేర్కొన్నాయి. నవంబర్ 19 లేదా 20 తేదీలలో కొత్త ప్రభుత్వం కొలువు తీరే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇందుకు పట్నాలోని గాంధీ మైదానం వేదిక కానున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం గాంధీ మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఆదివారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించనుందని.. ఆ తర్వాత కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాణస్వీకారానికి 19 లేదా 20లలో ఏ తేదీని నిర్ణయిస్తారనే విషయం ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపాయి. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపే అవకాశమున్నట్లు తెలస్తోంది. ఈ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమవుతాయి.

**మంత్రివర్గంలో సింహభాగం భాజపాకు..**

కొత్త ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పు కోసం కేంద్రమంత్రి అమిత్‌షాతో కూటమి నేతలు శనివారం సమావేశమైనట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో భాజపాకు సింహభాగం వాటా దక్కే అవకాశం ఉన్నట్లు కూటమి వర్గాలు పేర్కొన్నాయి. తర్వాతి స్థానంలో జేడీయూ ఇతర పార్టీలు ఉన్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్)కి మూడు మంత్రి పదవులు ఇవ్వనున్నట్లు సమాచారం.

# లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



- ఇద్దరు మృతి.. ఆరుగురికి తీవ్రగాయాలు
- జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**జనగామ, సిటీ టైమ్స్**


రాష్ట్రంలో నిత్యం ఎక్కడో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలం నిడిగొండ దగ్గర ఆగి ఉన్న ఇసుక లారీని రాజధాని బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్రగాయాలు కావడంతో వారిని జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే.. చనిపోయిన వారిని దిండిగల్ కు చెందిన పులమాటి ఓం ప్రకాష్, హన్మకొండకు చెందిన నవదీప్ సింగ్ గా గుర్తించారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో విషాధ ఛాయలు అలముకున్నాయి. అయితే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు..మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

# రైతుల సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు
- ప్రభుత్వానికి హరీశ్ సూచన
- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం
- వండ్ల విషయంలో ఆందోళనచెందుతున్నరు

**మెదక్, సిటీ టైమ్స్**

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం మల్లారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటివరకు కొన్నది కేవలం ఐదారు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే అని తెలిపారు. 85 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పి ఐదారు లక్షలకే పరిమితమైందని మండిపడ్డారు. కొన్న వాటికి కూడా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ధ్వజమెత్తారు.



# లగ్గాలు తెగిపోతున్నయ్

- విడాకులు కామన్ అవుతున్నయ్
- 25 నుంచి 35 ఏండ్ల మధ్య ఉన్న జంటల్లోనే ఎక్కువ
- కెరీర్ ఒత్తిడి, అంచనాలు.. వ్యక్తిగత స్పేస్ కారణం

**హైదరాబాద్, సిటీ టైమ్స్**



పెళ్లి అనేది ఇద్దరి మధ్య కేవలం ఒక ఒప్పందం కాదు.. జీవితాంతం ఒకరికి ఒకరు అండగా నిలవాలని ఇచ్చుకునే మాట. ప్రేమ, నమ్మకం, ఓపిక, అర్థం చేసుకోవడం అనే నాలుగు స్తంభాలపై నిలబడే ఈ బంధం, కాలం మారినా విలువ మాత్రం ఎప్పటికీ తగ్గదు. ఆనందాల్లో భాగస్వాములవడం ఎంత ముఖ్యమో, కష్టాల్లో చేతులు పట్టుకొని నిలవడం అంత కన్నా ముఖ్యమైనది. అందుకే మన పెద్దలు "పెళ్లి అనేది రెండు మనసులు, రెండు కుటుంబాలు కలిసే పవిత్రమైన అనుబంధం" అంటుంటారు. అయితే, నేటి వేగమైన జీవనశైలిలో ఈ బంధం ముందెన్నడూ లేనంత పరీక్షలను ఎదుర్కొంటూ ఉంది. నగర జీవనం, ఒత్తిడి, అంచనాలు, సంఘర్షణలు ఇవన్నీ కలిసి ఈ పవిత్ర బంధానికి సవాళ్లు విసురుతున్నాయి.

ముఖ్యంగా హైదరాబాద్‌లో దాంపత్య జీవితం క్రమంగా బలహీనపడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ప్రేమ పెళ్లి, అనుకోని పెళ్లి ఏ రూపంలో జరిగినా, చాలామంది జంటలు చిన్న చిన్న విషయాలకే కోర్టు మెట్లెక్కుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇగో క్లాష్‌లు, ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోవడం, ఆత్మవిశ్వాసం లోపించడం, వివాహేతర సంబంధాలు, సోషల్ మీడియా ప్రభావం, త్వరగా నిర్ణయాలు తీసుకోవడం ఇలా చెప్పుకుంటూ పోతే కారణాల జాబితా పెద్దదే.

అయితే ఇక్కడ ప్రత్యేకంగా 25-35 ఏళ్ల మధ్య వయసున్న జంటలే ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటున్నారని న్యాయవాదులు చెబుతున్నారు. ఈ వయసులోనే కెరీర్ ఒత్తిడి, అంచనాలు, వ్యక్తిగత స్పేస్ కోసం పోరాటం ఎక్కువగా ఉండటం వల్ల చిన్న గొడవలు పెద్దగా మారుతున్నట్లు కనిపిస్తుంది. ఫ్యామిలీ కోర్టుల రికార్డుల ప్రకారం, ప్రతి నెలా సుమారు 250 విడాకుల కేసులు నమోదవుతున్నాయి. ఇది నగరంలోని మారుతున్న జీవన శైలికి అద్దం పడుతోంది.

పెద్దల మాట ప్రకారం "బంధాన్ని బలపరచుకోవాలి గాని, బలహీనపరచుకోవడానికి కాదు"అని చెబుతున్నప్పటికీ, చాలా జంటలు మాట్లాడుకోవడం, కౌన్సిలింగ్ తీసుకోవడం వంటి అవకాశాలను వదిలేసి వెంటనే విడాకుల వైపు అడుగులు వేస్తున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంపత్యంలో సమస్యలు వచ్చినప్పుడు ఒకరికొకరు వినండి, అర్థం చేసుకోవడం, సమయం ఇవ్వడం చాలా అవసరమని వారు సలహా ఇస్తున్నారు.

# నవీన్ యాదవ్‌కు కీలక పదవి ఇచ్చే చాన్స్

**హైదరాబాద్, సిటీ టైమ్స్**



హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలకమైన పదవిని కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయనకు ప్రభుత్వ విప్ పదవిని ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రభుత్వ విప్ పదవి రాష్ట్ర మంత్రి హోదాకు సమానమైన గౌరవాన్ని, అధికారాలను కలిగి ఉంటుంది. ప్రభుత్వ విప్ పదవికి నవీన్ యాదవ్‌ను ఎంపిక చేయడానికి ప్రధానంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే కారణమని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం ముగ్గురు విప్‌లు ఉన్నారు. మరో నలుగురిని నియమించుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంది. ఈ ఖాళీలలో ఒక దాన్ని నవీన్ యాదవ్‌కు కేటాయించడం ద్వారా పలు రాజకీయ లక్ష్యాలను చేరుకోవాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్ జిల్లా నుంచి అజారుద్దీన్‌ను మంత్రిగా కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఒకే జిల్లా నుంచి మరో మంత్రి పదవి ఇవ్వడం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్ అధిష్టానం.. విప్ పదవి ద్వారా మంత్రి స్థాయి హోదాను అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

నవీన్ యాదవ్ బలమైన బీసీ సామాజికవర్గానికి చెందినవారు కావడం ముఖ్యమైన అంశం. బీసీలకు పాలనలో తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని సందేశం ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఈ నిర్ణయానికి మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో యాదవ సామాజిక వర్గం పెద్ద సంఖ్యలో ఉండటం కూడా మరో కారణంగా తెలుస్తోంది. ఇంతకాలం గ్రేటర్ పరిధి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన బలమైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో లేరు. ఇప్పుడు నవీన్ యాదవ్ విజయం సాధించి, ఎమ్మెల్యేగా ఎన్నికవడం ద్వారా ఆయనకు విప్ పదవి ఇవ్వడం వల్ల యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో అత్యధిక ప్రాధాన్యం దక్కినట్లు అవుతుంది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని యాదవ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకోవడానికి ఈ నిర్ణయం వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని అధిష్టానం అంచనా వేస్తోంది.

ప్రభుత్వ విప్ హోదా కేవలం శాసనసభ వ్యవహారాలకే పరిమితం కాదు. ఈ హోదాతో నవీన్ యాదవ్‌కు నగరంలోని ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, విప్ హోదాకు ఉండే అధికారం, అధికారిక వాహనం, కార్యాలయం, ఇతర ప్రోటోకాల్ సౌకర్యాలు నగరంలో ఆయన పలుకుబడిని పెంచుతాయి. ఈ పదవి ద్వారా నగరంలో కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు, యాదవ సామాజిక వర్గంతో కాంగ్రెస్ బంధాన్ని పటిష్టం చేసేందుకు వీలుంటుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నిర్ణయంపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

# ఇలాంటి సందేశాలు మనోధైర్యాన్ని పెంచుతాయి

- కేబినెట్ హోదా ఇచ్చే అవకాశం
- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే
- సిద్ధమైన సీఎం రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ విజేతకు జాక్‌పాట్

**హైదరాబాద్, సిటీ టైమ్స్**



ఫలితాలు ఎల్లప్పుడూ మనం చేసే పనిని ప్రతిబింబించకపోవచ్చు.. లేదా మన అంచనాలకు అనుగుణంగా ఉండకపోవచ్చు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కానీ ఇలాంటి సందేశాలు మనోధైర్యాన్ని పెంచుతాయని కేటీఆర్ అన్నారు. మద్దతు ఇచ్చిన మీ అందరికీ ధన్యవాదాలు అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మరింత శక్తి చేకూరాలని, కేటీఆర్ కష్టం వృధా కాదని అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం అనంతరం మద్దతుదారులు పేర్కొన్నారు. ఈ సందేశాలను కేటీఆర్ తన ట్వీట్‌కు జోడించారు.

పరిపాలనలో అసమర్థుడు, ఎన్నికల ప్రక్రియలో అరాచకుడు ఈ ముఖ్యమంత్రి. ఇది కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలకు తోడుగా పోలీసులు, ఎన్నికల కమిషన్ తోడై సాధించిన అక్రమ, అప్రజాస్వామిక విజయం. ఈ అరాచకత్వాన్ని, అక్రమ పొత్తులను, గూండాయిజాన్ని తెలంగాణ సహించదు. మూడు పార్టీలకు ముచ్చెటమలు పట్టేలాగా చేశాం. ఒక ఉప ఎన్నికోసం ఈ సీఎం ఎనిమిది రోజులు జూబ్లీహిల్స్ గల్లీలు తిరిగేటట్టు చేశాం. ఎన్నికల నిబంధనలు అన్ని ఉల్లంఘించారు. వేలాది ఫేక్ ఓట్లు వేయించుకుంది కాంగ్రెస్. నైతికంగా ఘోరంగా ఓడిపోయారు. పోలింగ్ రోజున కూడా పట్టపగలు మంత్రులు జనాలను ప్రలోభపెట్టి, కాన్వాయ్‌లు వేసుకుని తిరిగారు అని ఓ మద్దతుదారు పేర్కొన్నారు.

మీ స్పష్టత, మీ వేగం, మీ దృక్పథం ఈ ఉప ఎన్నిక కంటే చాలా పెద్దవి. మీ నాయకత్వం మరింత బలోపేతం అవుతుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీ కృషికి మేమందరం గర్విస్తున్నాము. ఓటమి తర్వాత పార్టీతో సంబంధలేని ప్రజలు కూడా బాధపడ్డారు. మీ ప్రయత్నం ఎప్పుడు కూడా వృధా కాకూడదు. ఈ రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను తీర్చిదిద్దిన నాయకుడు మీరు. ఈ ఉప ఎన్నికలో చూపించిన కృషి, అంకితభావం.. రాబోయే రోజుల్లో కొత్త ఊపు, బలాన్నిస్తాయి. బీఆర్ఎస్ స్ఫూర్తిపై నమ్మకం పెట్టుకున్న లక్షలాది మంది మీకు మద్దతుగా నిలబడే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ శ్రేయోలాభిషులు పేర్కొన్నారు.

# అమెరికాలో సామాన్లు పిరం

**వాషింగ్టన్, సిటీ టైమ్స్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పలు దేశాలపై సుంకాలు విధించి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో పలు వస్తువుల ధరలు పెరిగిపోయాయి. వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఒత్తిడికి తలొగ్గిన ట్రంప్.. ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఇటీవల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం కూడా ట్రంప్ దిగి రావడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఎట్టకేలకు దిగొచ్చిన ట్రంప్. గొడ్డు మాంసం, కాఫీ, అరటి పండ్లు, నారింజ, పండ్ల రసం లాంటి పలు ఆహార ఉత్పత్తులపై సుంకాలను తొలగించారు. పలు దేశాలపై భారీగా సుంకాలు విధించినప్పటికీ ఆ ప్రభావం వినియోగదారులపై పడదని ఇంతకాలం ట్రంప్ చెబుతూ వచ్చారు. కానీ గొడ్డు మాంసం ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల్లో తమ ప్రతాపం చూపించారు. అమెరికాకు బ్రెజిల్ నుంచి భారీగా గొడ్డు మాంసం ఎగుమతి అవుతుంది. బ్రెజిల్‌పై కూడా ట్రంప్ భారీ సుంకాలు విధించారు. దాంతో గొడ్డు మాంసం ధర భారీగా పెరిగిపోయింది.



వినియోగదారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ట్రంప్ దిగొచ్చారు. గొడ్డు మాంసంతోపాటు పలు ఆహార ఉత్పత్తులు, ఎరువులపై సుంకాలను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

**- పలు నిర్మాణ పనులకు కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన**

**నిజాంపేట, సిటీటైమ్స్:**

ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో మౌలిక వసతుల కోసం కృషి చేస్తున్నామని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. ఇటీవల నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి సెంట్రల్ స్కూల్ నుండి జగన్ స్టూడియో వరకు ఉన్న రహదారి పూర్తిగా పాడవటంతో ట్రాఫిక్ సమస్యలు ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుందని నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించి



సమస్యలను వివరించారు. వెంటనే స్పందించి సీసీ రోడ్ , డివైడర్ సెంట్రల్ లైటింగ్ పనులకు నిధులు మంజూరు చేయించారు హన్మంత్ రెడ్డి. ఆదివారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డిలను కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడా శ్రీనివాసరావు , ఆలేటి శ్రీనివాసరావు , సాంబశివరావు , వీరయ్య , మధు , సత్య , బాల్ రెడ్డి , మల్లేష్ మతం, మరియు కాలనీ వాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీజేపీకి కెప్టెన్ సంక్షోభం..
# కేడర్ గందరగోళం

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు విఫలమా?**
**- బలమైన నాయకులున్నా నాయకత్వ లోపమే కారణమా?**
**- వెలువడుతున్న బీజేపీ నేతల అంతర్గత విశ్లేషణలు**





**హైదరాబాద్, నవంబర్ 16 (సిటీటైమ్స్)**

2024 పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 8 లోకసభ స్థానాలు సాధించిన బీజేపీ, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో డిపాజిట్ కూడా రాకపోవడం సాధారణ పరాజయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు, విద్యావంతులు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం నిలబడలేకపోవడం, ప్రజల్లో పార్టీపై నమ్మకం ఎంతగా క్షీణించిందో స్పష్టంగా తెలియజేసిందని, ప్రత్యర్థుల బలం కంటే బీజేపీ అంతర్గత అసమన్వయమే అసలు కారణమని పార్టీ శ్రేణుల్లో అంతర్మథనం ఎక్కువైంది.

**బలమైన నాయకత్వం లేకపోవడమేనా?**

ఇప్పటివరకు బీజేపీకి వచ్చిన లోకసభ విజయాల్లో నేతలు వ్యక్తిగతంగా బలంగా ఉన్నా, ఆ విజయాలకు మూలబలం మాత్రం మోడీ ప్రభావమేనని విశ్లేషకుల వాదన. అరవింద్ ధర్మపురి, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ ఎవరిని చూసినా — మోడీ పేరు ప్రధానంగా పనిచేసిందని పేర్కొంటున్నారు. అయితే అసెంబ్లీ రాజకీయాల్లో ఈ నేతల పరిస్థితి మాత్రం వేరే కథ చెబుతోంది. ఈ వాస్తవాలు వ్యక్తిగత మాస్ సరిపోదని, పార్టీకి దిశా నిర్దేశించే బలమైన నాయకత్వం తప్పనిసరిగా కావాల్సిందేనని బీజేపీ శ్రేణులు అంతర్గతంగా చర్చించుకుంటున్నాయి.

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు విఫలమా?**

రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ ఒకే దిశలో కదులుతున్నట్టు కనిపించడం లేదనే వాదనలు పెరుగుతున్నాయి. కేడర్‌లో సమన్వయం లేకపోవడం, నిర్ణయాల్లో స్పష్టత లేకపోవడం, నాయకత్వం బలహీనంగా మారిందన్న అభిప్రాయాలు — జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో మరింత బలమైనట్లు శ్రేణులు భావిస్తున్నాయి.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కూడా ఇదే విమర్శ వినిపిస్తోంది. ఉన్నత హోదా ఉన్నా, ఆ హోదాకు తగిన ప్రభావం, సమన్వయం, స్పందన ప్రజల్లో కనిపించడం లేదన్న అభిప్రాయాలు పార్టీ అంతర్గతంగానే చర్చకు వస్తున్నాయి. అదేవిధంగా కేంద్ర మంత్రి హోదాలో బండి సంజయ్ చేసిన కొన్ని ప్రసంగాలు కూడా పార్టీ ఇమేజ్‌కి నష్టం చేశాయని పార్టీ మేధావులు భావిస్తున్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ప్రచారంలో మోడీ, ప్రజా సమస్యలపై కాకుండా వర్గీకరణ వ్యాఖ్యలు చేయడం ఓటర్లపై ప్రతికూల ప్రభావం చూపిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇదే ధోరణి కొనసాగితే తెలంగాణలో బీజేపీ మనుగడకే ప్రమాదమని వారికి స్పష్టంగా కనిపిస్తున్నట్టు చెబుతున్నారు.

**పార్టీకి పెద్ద అడ్డంకిగా మారిన నాయకత్వ లోపమేనా?**

తెలంగాణలో బలమైన నాయకులు ఉన్నా — వారందరినీ ఒకే దారిలో నడిపించే కెప్టెన్ లేదన్న భావన ఇప్పటివరకు ఎప్పుడూ ఇంత స్పష్టంగా బయటకు రాలేదని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. రాజాసింగ్ అసహనం వ్యక్తపరచి రాజీనామా చేయాల్సిన స్థితికి చేరుకోవడం కూడా ఇదే అంతర్గత గందరగోళాన్ని బట్టబయలు చేసిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రఘునందన్, ఈటెల, అరవింద్, రాజాసింగ్ — వీరందరికీ వేర్వేరు మద్దతు వర్గాలు, వేర్వేరు దృష్టికోణాలు ఉన్నా, ఈ నాయకత్వాన్ని ఒకే దిశలో నడిపించే శక్తి రాష్ట్ర నాయకత్వంలో లేకపోవడం పార్టీకి పెద్ద అడ్డంకిగా మారిందనే అభిప్రాయమే ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. కమలానికి గెలుపు దూరం కావడానికి అసలు కారణం — నాయకత్వ దౌర్బల్యం, సమన్వయ లేమి అన్న విశ్లేషణలు పార్టీ అంతర్గతంగా బలపడుతున్నాయి. దీనిపై బీజేపీ రాబోయే రోజుల్లో ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో... వేచి చూడాల్సిందే.

# ఐ బొమ్మ క్లోజ్




**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలుగు సినీ పరిశ్రమను ఏళ్ల తరబడి వణికించిన పైరసీ మాఫియాకు చెక్ పడింది. ఐబొమ్మ , బప్పం టీవీ వంటి పైరసీ వేదికల ప్రధాన నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్ కావడమే కాదు, అతని అరెస్టుకు కారణమైన నేపథ్యం బయటకు రావడం మరింత సంచలనం గా మారింది. ఈ మొత్తం ఆపరేషన్ వెనుక రవి భార్య కీలక పాత్ర పోషించిందన్న విషయమే ఇప్పుడు ఇంటర్నెట్‌ను కుదిపేస్తోంది. విదేశాల్లో ఉంటోన్న రవికి కొంతకాలంగా భార్యతో విభేదాలున్నాయి. ఆ నేపథ్యంలోనే విడాకుల చర్చ కోసం రవి హైదరాబాద్‌కు వస్తున్న సమాచారాన్ని ఆమె గోప్యంగా సైబర్ క్రైమ్ అధికారులకు అందించడంతో పోలీసులు ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆమె అందించిన టైమ్‌లైన్, లొకేషన్ వివరాల ఆధారంగా రవిని ట్రాక్ చేసిన పోలీసులు, ఫ్రాన్స్ నుండి అర్ధరాత్రి హైదరాబాద్ చేరుకున్న రవిని కూకట్‌పల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు.

రవిని అరెస్ట్ చేయడంతోనే కాదు.. అతను కొన్నాళ్లుగా నడిపిస్తోన్న పైరసీ సామ్రాజ్యాన్ని పూర్తిగా నిలిపివేయించడంలో పోలీసులు విజయం సాధించారు. 'నా వద్ద కోట్ల మంది డేటా ఉంది... ఈ వెబ్‌సైట్‌ను టచ్ చేయొద్దు' అంటూ రవి గతంలో పోలీసులుపై విసిరిన సవాలే ఈ కేసులో మలుపు తెచ్చింది.

అరెస్టు అనంతరం రవి ల్యాప్‌టాప్‌లు, వెబ్ లాగిన్‌లు, సర్వర్ వివరాలను పోలీసులు స్వాధీనం చేసుకుని అతడి సమక్షంలోనే వంటి పైరసీ వేదికలను శాశ్వతంగా బ్లాక్ చేయించారు. విదేశీ సర్వర్ల ద్వారా నడుస్తున్న ఈ ప్లాట్‌ఫార్మ్‌లను డీయాక్టివేట్ చేయడంలో రవి సహకారం తీసుకోవడం పోలీసుల వ్యూహాత్మక విజయంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం పోలీసులు రవి నుంచి స్వాధీనం చేసుకున్న వందల సంఖ్యలో హార్డ్‌డిస్క్‌లను, అతని బ్యాంక్ లావాదేవీలను, పైరసీ ద్వారా వచ్చిన అక్రమ ఆదాయ మార్గాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈ పైరసీ నెట్‌వర్క్ వెనుక ఉన్న ఇతర వ్యక్తులపై కూడా దర్యాప్తు ప్రారంభమైంది. రవిని మరింత సమాచారం కోసం కస్టడీకి తీసుకోవాలని సైబర్ క్రైమ్ విభాగం సోమవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది.

తెలుగు సినీ పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగించిన iBomma వంటి సైట్లు నిర్మాతలపై తీవ్ర ప్రభావం చూపాయి. సినిమాలు థియేటర్లకు, ఓటీటీలకు చేరకముందే లీక్ అవ్వడంతో భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో నిర్మాతలు ఇటీవలే అధికారికంగా ఫిర్యాదులు ఇచ్చిన తర్వాత హైదరాబాద్ పోలీసులు అంతర్జాతీయ స్థాయిలో సర్వర్‌లను ట్రాక్ చేస్తూ రవిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఇమ్మడి రవిని పట్టుకునే క్రమంలో అతడి భార్య ఇచ్చిన సమాచారమే కేసును ముగింపు దిశగా తీసుకెళ్లింది. ఆమె సహకారాన్ని కొందరు "భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల తీవ్రత"గా చూస్తుండగా, మరికొందరు మాత్రం "ఆమె ధైర్యం వల్లే తెలుగు సినిమా పరిశ్రమ పెద్ద నష్టాన్ని తప్పించుకుంది" అంటూ ప్రశంసిస్తున్నారు.

# ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి.. రామోజీరావు: ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్



**సిటీ టైమ్స్, హైదరాబాద్**

రామోజీరావు ఓ కుగ్రామం నుంచి వచ్చి ఎంతో గొప్ప స్థాయికి ఎదిగారని భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కొనిడాయారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధాకృష్ణన్ మాట్లాడారు. "సిబ్బందిలో రామోజీరావు బృంద స్ఫూర్తిని నింపేవారు. ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి రామోజీరావు. దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా స్పందించేవారు. ఆయన దానం చేస్తూ.. ప్రజలనూ భాగస్వాములను చేసే వారు. సమాజానికి స్ఫూర్తిగా నిలవడమే ఓ గొప్ప విజయం. స్క్రిప్ట్‌తో వస్తే ఫస్ట్ ప్రింట్‌తో వెళ్లేలా రామోజీఫిల్మ్‌సిటీని తీర్చిదిద్దారు" అని ఉప రాష్ట్రపతి కొనియాడారు.

రామోజీరావు 89వ జయంతిని పురస్కరించుకొని రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.





# దమ్ముంటే పట్టుకోండి

**- అన్నోడిని పట్టుకున్నం**
**- సీవీ ఆనంద్ సంచలన ట్వీట్**
**- సైబర్ క్రైమ్ పోలీసులకు అభినందనలు**
**- జూన్ నుంచి స్పెషల్ ఆపరేషన్**

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

దమ్ముంటే పట్టుకోండి అన్నోడిని పట్టుకున్నారని ఆనంద్ తెలిపారు. ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను రాష్ట్ర హోం శాఖ స్పెషల్ సీఎస్ ఈవీ ఆనంద్ అభినందనలు తెలిపారు.. జూన్ నుంచి సైబర్ క్రైమ్ టీమ్ రేయింబవళ్లు కష్టపడింది. రవిని తప్ప ఈ పైరసీకి సంబంధించిన వాళ్లందరినీ పట్టుకుందని పేర్కొన్నారు... డీసీపీ కవిత, సీపీ సజ్జనార్‌కు కంగ్రాట్స్ చెప్తూ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "దమ్ముంటే నన్ను పట్టుకోండి" అని పోలీసులనే సవాలు చేస్తూ బెదిరించిన వ్యక్తిని చివరకు అరెస్ట్ చేసినందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ క్రైమ్ డీసీపీ కవిత మరియు టీమ్ కి నా అభినందనలు. ఈ సందర్భంగా హెచ్‌డీ మూవీ పైరసీ కేస్ ప్రెస్ మీట్ వివరాలు మళ్లీ రీపోస్ట్ చేస్తున్నాను. హ్యాకర్లు డిజిటల్ కంపెనీస్ సర్వర్లు హ్యాక్ చేసి సినిమా విడుదలకు ముందే ఒరిజినల్ కాపీలను తమ వెబ్‌సైట్లలో విడుదల చెయ్యటం వలన సినిమా పరిశ్రమకు భారీ నష్టాలు వచ్చాయి. జూన్ 5 నుంచి రాత్రింబవళ్లు కష్టపడి పని చేసిన సైబర్ క్రైమ్ టీమ్ ఈ పైరసీ రాకెట్లో ఉన్న కీలక నిందితులందరినీ అరెస్ట్ చేసింది. ఇప్పటి వరకు విదేశాల్లో ఉన్న రవిని తప్ప. హైదరాబాద్ సిటీ పోలీస్, సీపీ సజ్జనార్, డీసీపీ సైబర్ క్రైమ్స్ కి నా అభినందనలు." అని సీవీ ఆనంద్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## రామోజీ.. ప్రజల పక్షాన
# పోరాడిన యోధుడు



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

నమ్మిన సిద్ధాంతాల కోసం రామోజీరావు దేనినైనా వదులుకునేవారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ఆలోచన ఎంతో ప్రశంసనీయమని, ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు చిరస్థాయిగా ఉంటాయని చెప్పారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు.

జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళసంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ విభాగాల్లో అవార్డులు ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రజల పక్షాన బలంగా పోరాడిన యోధుడు రామోజీరావు అని కొనియాడారు. ప్రతిపక్షం బలహీనంగా ఉంటే రామోజీయే ఆ పాత్ర పోషించారని చెప్పారు.

''అక్షర యోధుడు రామోజీరావుకు నివాళులు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరిశ్వాస వరకూ ఆయన పోరాడారు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. ఉన్నత విలువలతో నడుస్తున్న సంస్థ ఈనాడు. ఈ పత్రిక ద్వారా రామోజీరావు.. ప్రజలను సమాజ సేవలో భాగస్వాములను చేశారు. ఎలాంటి విపత్తు వచ్చినా సొంత డబ్బుతో సేవలు అందించారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే ప్రజలు బాగా స్పందించేవారు. ఒక సీఎంగా తెలుగు భాషను కాపాడేందుకు ఏమైనా చేస్తా. రామోజీ స్ఫూర్తిగా తెలుగు భాషకోసం సంరక్షణ కోసం ప్రయత్నిస్తా'' అని చంద్రబాబు అన్నారు.

# పాత్రికేయ రాజర్షి రామోజీరావు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

మహోన్నత వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి.. అక్షర శక్తికి సరికొత్త నిర్వచనమిచ్చిన పాత్రికేయ రాజర్షి రామోజీరావు అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. స్వయం కృషి, క్రమశిక్షణ, పట్టుదల, చిత్తశుద్ధి, కార్యదీక్షలే ఆయుధాలుగా అనేక రంగాల్లో విజయాలు సాధించి భవిష్యత్ తరాలకు మార్గదర్శనం చేశారని కొనియాడారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. ''రామోజీరావు లేని ఆయన సంస్థలను ఊహించుకోలేకపోతున్నా. ఆయన ఒక వ్యక్తి కాదు శక్తిమంతమైన వ్యవస్థ. జనహితమే జర్నలిజం అని నమ్మి ఆచరించిన మహా మనిషి. సాధారణ రైతు బిడ్డ స్థాయి నుంచి.. ప్రపంచమంతా తెలుగువారి వైపు చూసేలా ఎదిగిన ఆయన జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. వారి సంస్థల ద్వారా ఎంతోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందారు. తెలుగు ప్రజల గుండెల్లో వారి స్థానం శాశ్వతం. వారి కృషి చిరస్మరణీయం. రామోజీరావులా ప్రజా జీవితంపై ముద్రవేసిన వ్యక్తి ఇటీవలి కాలంలో మరొకరు లేరు''

''విభిన్న రంగాల్లో విశిష్ట సేవలందించిన గొప్ప వ్యక్తులకు రామోజీరావుగారి జన్మదినాన్ని పురస్కరించుకుని.. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులతో సత్కరించడం అభినందనీయం. రామోజీరావు కేవలం వ్యాపారవేత్త మాత్రమే కాదు.. తెలుగు జాతి కీర్తిని ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేసిన క్రాంతి దర్శి. వారి జీవితం.. అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని నిరూపించిన అమర గాథ. రామోజీరావు విజయం సామాజిక నిబద్ధత అనే పునాదిపై నిర్మితమైన మహా వృక్షం. రామోజీరావు పత్రికను ధర్మయుద్ధానికి ఉపయోగించారు. తెలుగు పోతే వెలుగు లేదు. మాతృభాషను కాపాడుకోవడమే రామోజీరావుకు మనం అందించే నివాళి'' అని వెంకయ్య నాయుడు అన్నారు.

**రామోజీరావు జయంతిని పురస్కరించుకొని రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.**



## రామోజీ.. పత్రికా రంగంలో

# దీపస్తంభంగా నిలిచారు

## జస్టిస్ ఎన్.వి.రమణ

హైదరాబాద్, సిటీ టైమ్స్

పత్రిక ద్వారా దేశాభివృద్ధికి రామోజీరావు విశేష కృషి చేశారని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. ఆయన నిబద్ధత కలిగిన వ్యక్తి అని, ఎప్పుడూ అధికారాన్ని కోరుకోలేదని చెప్పారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ.. పత్రిక ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణకు రామోజీరావు కృషి చేశారని కొనియాడారు.

''రామోజీరావు ఎప్పుడూ తన పత్రికను స్వప్రయోజనాల కోసం వాడుకోలేదు. పత్రికారంగంలో ఒక దీపస్తంభంగా నిలిచారు. సారా వ్యతిరేక, సమాచార హక్కు ఉద్యమాలను ప్రోత్సహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. రామోజీరావు వారసులు వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు'' అని అన్నారు. ఈ సందర్భంగా రామోజీ ఫౌండేషన్ రూపొందించిన నిఘంటువులను జస్టిస్ ఎన్.వి.రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు.

రామోజీరావు జయంతిని పురస్కరించుకొని రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్ ప్రారంభోపన్యాసం చేశారు. ''క్రమశిక్షణ అంకిత భావంతో సామాన్యుడు కూడా అసామాన్యుడిగా ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చని నమ్మిన వ్యక్తి రామోజీరావు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. 900 మందిని పరిశీలించి ఏడుగురికి రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ఇస్తున్నాం. ఏడుగురిలో నలుగురు మహిళలు కావడం విశేషం'' అని సీఎండీ అన్నారు.

# రాష్ట్రానికి ఫోర్త్ వండర్‌గా రామోజీఫిల్మ్‌సిటీ










హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణ రాష్ట్రానికి ఫోర్త్ వండర్‌గా రామోజీఫిల్మ్‌సిటీ నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని పేర్కొన్నారు. ఆదివారం రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''రామోజీ అవార్డుల ఆలోచన చేసిన ఆయన కుటుంబ సభ్యులను అభినందిస్తున్నా. రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని వారు భావించడం ప్రశంసనీయం. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరమంటే నాలుగు అద్భుతాలు గుర్తొస్తాయి. అందులో మొదటిది ఛార్మినార్, రెండోది గోల్కొండ, మూడోది హైటెక్ సిటీ, నాలుగు.. రామోజీ ఫిల్మ్‌సిటీ. తెలుగు సినీ పరిశ్రమ నంది అవార్డులతో మొదలై.. ఆస్కార్ అవార్డుల వరకు ఎదిగిందంటే ఈ ప్రాంతంలో కట్టిన స్టూడియోలతో పాటు రామోజీ ఫిల్మ్ సిటీ కూడా ఎంతో తోడ్పాటునందించింది.

''ఈనాడు దిన పత్రిక 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఉదయం లేవగానే ఈనాడు పేపర్ చదవడం.. రాత్రి ఈటీవీ న్యూస్ చూసి నిద్రపోవడం రామోజీరావు తెలుగు ప్రజలకు అలవాటుగా మార్చారు. రాజకీయ నాయకులకు ఈ అలవాటు వ్యసనంగా మారింది. ఉదయం నాకు ఎన్ని పత్రికలు వచ్చినా ఈనాడు పేపర్ కచ్చితంగా చదువుతా. నిఖార్సైన నిజం ఏంటో తెలుసుకోవాలంటే ఈనాడు చదవాల్సిందే. ఇంటి వద్ద ఉన్నా.. ఎక్కడికి వెళ్లినా.. రాత్రి 9గంటలకు ఈటీవీ న్యూస్ తప్పనిసరిగా చూస్తా. వాళ్ల ఆలోచనలను కాకుండా.. జరిగిన వాస్తవాలను ప్రజలకు అందించాలన్న స్ఫూర్తి .. ఈనాడు, ఈటీవీలో కనిపిస్తుంది. పొంతన లేని వివిధ రంగాల్లో ఒకే వ్యక్తి రాణించడం చాలా కష్టం. రోజుకు 18 గంటలకు శ్రమించిన రామోజీరావు.. ఏ రంగంలో అడుగు పెట్టినా నంబర్ వన్‌గా నిలిచారు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఇది నాకు దక్కిన గౌరవం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

రామోజీరావు పేరిట ఏడు అవార్డులు ఇవ్వడం ప్రశంసనీయమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజాసేవ కోసం రామోజీరావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఏడు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు దక్కడం ఆయా రంగాల్లో వారి కృషికి గుర్తింపు అని అన్నారు. అవార్డు గ్రహీతలంతా దీనిని ఓ బాధ్యతగా గుర్తించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

రామోజీరావు 89వ జయంతిని పురస్కరించుకొని రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.



# వన్డే సిరీస్ భారత్-ఎదే

రాజ్‌కోట్: దక్షిణాఫ్రికా-ఎతో అనధికార మూడు వన్డేల సిరీస్‌ను భారత్-ఎ ఒక మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఆదివారం రెండో వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. మొదట సఫారీ జట్టు 30.3 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. 33 పరుగులు చేసిన రివాల్డో మూన్‌సామీ టాప్ స్కోరర్. నిశాంత్ సింధు (4/16), హర్షిత్ రాణా (3/21), ప్రసిద్ధ్ కృష్ణ (2/21), తిలక్‌వర్మ (1/12) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. రుతురాజ్ గైక్వాడ్ (68 నాటౌట్; 83 బంతుల్లో 9×4) సత్తా చాటడంతో భారత్ 27.5 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అభిషేక్ శర్మ (32), తిలక్‌వర్మ (29 నాటౌట్) కూడా రాణించారు.

# కష్టాల్లో హైదరాబాద్

జమ్ము: జమ్ము కశ్మీర్‌తో రంజీ ఎలైట్ గ్రూప్-డి మ్యాచ్‌లో హైదరాబాద్ కష్టాల్లో పడింది. తొలి రోజు, ఆదివారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 88/6తో నిలిచింది. 16 పరుగులకే 3 వికెట్లు పడినా.. కెప్టెన్ రాహుల్ సింగ్ (48) హైదరాబాద్‌ను ఆదుకున్నాడు. 42/3తో కాస్త కోలుకున్న హైదరాబాద్ మళ్లీ తడబడింది. 39 పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు జమ్ము కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే ఆలౌటైంది. అబిద్ ముస్తాక్ (57) ఆ జట్టులో టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. తనయ్ త్యాగరాజన్ (3/19), కార్తికేయ (3/48), రక్షణ్ (2/54) ప్రత్యర్థిని కట్టడి చేశారు.

# 4 పతకాలు ఖాయం

## ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్



గ్రేటర్ నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. ఆదివారం బొలోత్ అక్‌బోత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి దూకుడు ముందు అక్‌బోత్ ఏ దశలోనూ నిలవలేకపోయింది. మరోవైపు ప్రీతి అంతే తేడాతో నిగినా ఉట్కమోవా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గగా.. ఆండ్రీ కలెట్‌స్కీ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. మరోవైపు స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించింది. గనియెవా (ఉజ్బెకిస్థాన్)తో ఆమె నేరుగా సెమీఫైనల్లో తలపడనుంది.

# మన స్పిన్ ఉచ్చులో మనమే..





## క్రీడా ముచ్చట్లు

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

**ఏదో అనుకుంటే...:** ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంతగడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. భారత బ్యాటర్ల ప్రదర్శన అభిమానులకు పెద్ద షాకే. ఒక్క బ్యాటర్ కూడా సాధికారికంగా ఆడలేకపోయాడు. అదే సమయంలో ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు. బ్యాటర్ల టెక్నిక్‌కు పరీక్ష ఎదురైందని, స్పిన్‌కు బాగా సహకరించే పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మన బ్యాటర్లు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సివుందని చెప్పాడు.

**తడబడ్డారిలా..:** లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. షార్ట్ బంతిని ఆడిన జైస్వాల్, వికెట్‌కీపర్ వెరీన్‌కు చిక్కాడు. రాహుల్ కూడా వెరీన్‌కే క్యాచ్ ఇచ్చాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా టీమ్ఇండియాను హార్మన్ మళ్లీ దెబ్బతీశాడు. అంతే.. ఆ తర్వాత భారత్ నుంచి ఎలాంటి ప్రతిఘటనా లేదు. పతనం వేగంగా సాగింది. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) కాస్త ధాటిగా ఆడినా.. అతడి ప్రయత్నం ఏమాత్రం సరిపోలేదు.

# సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం




- ఏసీపీలు రమేష్ కుమార్, వెంకటేష్
- టిఎస్ జెయు ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

హైదరాబాద్ నవంబర్ 16,(సిటీ టైమ్స్ ):
సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, హైదరాబాద్ సిసిఎస్ ఏసిపి సిహెచ్. వెంకటేష్ లు అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) ఆధ్వర్యంలో నగరంలోని టీఎస్ జెయు రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సిసిఎస్ ఏసీపీ వెంకటేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు నైతిక విలువలు పాటించాలని సూచించారు. సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర అనితర సాధ్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తెచ్చి సమాజానికి సరైన దిశ చూపడం జర్నలిస్టు ధర్మమని అన్నారు. ఇందుకు నైతిక విలువలు, జర్నలిస్టిక్ ఎథిక్స్ పాటించాలని సూచించారు. నిజా నిజాలను పరిశీలించి, ధృవీకరించి వార్తలను ప్రచారం చేయడం ద్వారా మీడియా విశ్వాసాన్ని నిలబెడుతుందని ఆయన సూచించారు. నేటి వేగవంతమైన సమాచార యుగంలో ఫేక్ న్యూస్ ఒక పెద్ద సవాలుగా మారిందని, దీనిని ఎదుర్కొనేది కూడా జర్నలిస్టులే కావాలని అన్నారు. వార్తల వేగం కన్నా వాటి నిజస్వరూపం ముఖ్యమన్నారు. ఒక జర్నలిస్టులో ఉన్న శక్తి సమాజాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. అందుకే సామాజిక బాధ్యతతో, వృత్తి పరమైన ప్రామాణికతతో పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిసిఎస్ ఏసీపీ వెంకటేష్ మాట్లాడుతూ పోలీస్-మీడియా మధ్య సమన్వయం చాలా కీలకమని పేర్కొన్నారు. కేసుల పరిశోధన, సామాజిక శాంతి భద్రతల పరిరక్షణలో జర్నలిస్టులు అందించే సమాచార సహకారం అమూల్యమని అన్నారు. పోలీసులు, మీడియా రెండూ ప్రజల కోసం పని చేసే వ్యవస్థలన్నారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. టిఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, రక్షణ చట్టాల అవసరం, వేతన-సౌకర్యాల సమస్యలను ప్రస్తావించారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఉదయ భాస్కర్ ను ఘనంగా సన్మానించారు. టిఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వాసు, నేషనల్ జర్నలిస్టు యూనియన్ ఆఫ్ (ఇండియా) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జెయు రాష్ట్ర నాయకులు ముత్యం ముఖేష్ గౌడ్, ఆంజనేయులు, ఎండి రియాజ్, మెరుగు విష్ణు మోహన్, చంద్రమౌళి, మహేందర్, కొప్పుల వెంకటేష్, గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహాలను సందర్శించిన జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్స్



వనపర్తి సిటీ టైమ్స్ నవంబర్ 16
వనపర్తి జిల్లా కేంద్రంలోని వివిధ వసతి గృహాలను జిల్లా విజిలెన్స్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆదివారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాలలో ఉన్న వసతులు బాగున్నాయా ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థులతో ముఖాముఖి విషయాలను వారు రాబట్టారు. అనంతరం విద్యార్థులు వారి యొక్క సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి తెస్తూ పాఠశాలలకు వెళ్ళటానికి బస్సు సౌకర్యం, మినరల్ వాటర్, వంట పాత్రల సమస్య, కంప్యూటర్ సౌకర్యం, ప్యాకెట్ మనీ, వైద్య శిబిరాలు, వసతి గృహాలకు పెయింటింగ్ ఇలాంటి చిన్న చిన్న విషయాలను ప్రభుత్వం ద్వారా త్వరగా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ప్రస్తుతం భోజనం వసతి చాలా బాగుందని విద్యార్థుల అభిప్రాయాలు తెలిపారు. ప్రత్యేకంగా చదువుకోనటం కోసం లైబ్రరీ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేయుటకు అవకాశం కల్పించాలని కమిటీ సభ్యులను కోరారు. ప్రస్తుతం చలికాలంలో స్నానం కోసం వేడి నీటి అవసరాలకు సోలార్ ప్యానల్ అన్ని వసతి గృహాలలో వెంటనే ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకొని ముందుకు సాగాలని ఎంతో కష్టపడి చదివిన వారు ఉన్నత స్థాయిలో ఉన్నారని మీరు కూడా ఉన్నత స్థాయికి ఎదగాలంటే నేటి నుండే పునాదులు వెయ్యాలని పలు సూచనలు చేశారు. వసతి గృహాలలో ఉన్న అధికారులతో మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరుతూ భోజనం వసతిని కూడ ఇంకా మెరుగుపరచాలని కమిటీ సభ్యులు కోరారు. విజిలెన్స్ కమిటీ దృష్టికి తెచ్చిన సమస్యలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జిల్లా కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు ఎడవల్లి వీరప్ప, విశ్వం బాబు, ద్వారపోగు వెంకటేష్, మాదారి భోజరాజు కే వెంకట్ గౌడ్, వసతి గృహాల అధికారులు సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జన్మభూమి రుణం తీర్చుకుంటున్న సన్నీ రెడ్డి..

- కిషన్ నగర్ గ్రామాభివృద్ధికి కదిలిన సన్నీ రెడ్డి..
- రూ. లక్షలతో కాంపౌండ్ వాల్ వినాయక మండపం అభివృద్ధి కృషి...



షాద్ నగర్ సిటీ టైమ్స్ నవంబర్ 16
తన సొంత గ్రామానికి తోడ్పాటునందిస్తూ రుణం తీర్చుకుంటున్నాడు రంగారెడ్డి జిల్లా కిషన్ నగర్ గ్రామానికి చెందినఓ యువకుడు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నాడు. గ్రామంలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు ఆలయ నిర్మాణానికైన ఖర్చులో వినాయక మండపానికి, గెస్ట్ హౌస్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి విరాళాన్ని అందిస్తానని హామీ ఇచ్చాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆ యువకుడు ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని నేడు ఉన్నత స్థాయికి చేరాడు. ప్రస్తుతం అమెరికాలోని స్టేట్ యూనివర్సిటీ గవర్నర్ గా సేవలందిస్తున్నాడు. గ్రామం నుంచి ఒక గవర్నర్ ఉండడం చాలా సంతోషమని గ్రామస్తులు అభినందిస్తున్నారు. 2024 నవంబర్ లో జరిగిన ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ తరుపున బరిలో నిలిచి 2.4 (24 లక్షల ) మరియు 70,000 ఓట్ల తేడా తో గెలుపొందారు గవర్నర్ అయినప్పటికీ తన పుట్టిన ఊరినీ మర్చిపోలేదు గ్రామానికి చెందిన శివాంజనేయుల దేవస్థానం ఆవరణలో వినాయకుని మండపం కాంపౌండ్ వాల్ నిర్మించడానికి హామీ ఇచ్చి మాట ప్రకారం ఈరోజు శంకుస్థాపన చేశారు. గ్రామానికి ఎలాంటి అభివృద్ధి పనులకైన ఆయన నా సపోర్ట్ ఉంటుంది అని తెలిపారు. అదే విధంగా గ్రామ మాజీ ఎంపీటీసీ కట్ట వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బద్దుల శ్రీశైలం శాలువాతో సన్మానించి కిషన్ నగర్ గ్రామానికి చెందిన సన్నీ రెడ్డి అమెరికాలోని వెన్ స్టేట్ యూనివర్సిటీ గ్రవర్నర్ గా ఎన్నికవడం కిషన్ నగర్ గ్రామానికి తెలంగాణ రాష్ట్రానికి యావత్ భారత దేశానికి గర్వ కారణం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి, స్నేహితులు వడ్ల చెన్నయ్య చారి, కాశీనాద్, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, సాదు సంజీవరెడ్డి, T. తిరుపతి రెడ్డి, ఎరువ వెంకట కృష్ణ రెడ్డి, వంగ లక్ష్మ రెడ్డి, ఎడమ కృష్ణ రెడ్డి, మంకల చంద్రం, వంగ కృష్ణ రెడ్డి, మిద్దెల మల్లా రెడ్డి, ఎడమ గోవర్ధన రెడ్డి, సాదు రంగ రెడ్డి, ఎరువ జనార్ధన్ రెడ్డి, వంగ సత్యనారాయణ రెడ్డి, మిద్దెల మాధవ రెడ్డి, విత్యల నరసింహ, తేజ్యా నాయక్, ఎడమ ప్రభాకర్ రెడ్డి, ఎడమ లక్ష్మ రెడ్డి, జంగం విజయ్, గ్రామ యువకులు మిద్దెల విక్రమ్ రెడ్డి, సాదు రవికాంత్ రెడ్డి, ఎడమ శ్రీపత్ రెడ్డి, కాంతల రాజు, మిద్దెల ప్రదీప్ రెడ్డి, దేశం ప్రవీణ్ రెడ్డి, దేశం ప్రశాంత్ రెడ్డి, చిలకమారి యోగి, ఎడమ కిరణ్ రెడ్డి, సాదు రేవంత్ రెడ్డి ప్రసాద్ గౌడ్ మరియు మనోహర్ గౌడ్ పాల్గొనడం జరిగింది.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



- ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.
- కేజీ కె ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకటయ్య.

పాలకుర్తి, (సిటీ టైమ్స్).
సూర్యాపేటలో జరిగే కల్లుగీత కార్మిక సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటయ్య గౌడ సమాజానికి పిలుపునిచ్చారు.
పాలకుర్తి మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్లో నాలుగో మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు కమ్మగాని నాగన్న అధ్యక్షతన జరిగింది.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాల్నే వెంకటయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి గౌడులకు ఇచ్చిన హామీలు అన్నిటిని అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి గురైన గీత కార్మికులకు, రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఎక్స్గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని వృత్తిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, కాటమయ్య సేఫ్టీ మోకులు అందరికీ ఇవ్వాలని చనిపోయిన కుటుంబాలకు, శాశ్వత వికలాంగులకు 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, తాత్కాలిక వికలాంగులకు లక్ష చొప్పున ఎక్స్గ్రేషియా నెల రోజులలో ఇవ్వాలని, మెడికల్ బోర్డు విధానం తొలగించాలి అని, ప్రమాదంలో చనిపోయిన వారి భార్యలకు పింఛన్ ఇవ్వాలని, 50 సంవత్సరాలు దాటిన అందరికీ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జనగామ జిల్లాకు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పేరు పెట్టారని, గ్రామాలలో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 18 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు బండి కొండయ్య, మండల కేజీ కేసు నాయకులు కమ్మగాని పరుశరాములు, గూడ రవీందర్, కమ్మగాని శ్రీకాంత్, తాళ్లపల్లి మదర్ తదితరులు పాల్గొన్నారు.



# దళిత యువకుడ్ని చంపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- యువ సత్తా లక్ష్మణ్ కుమార్



షాద్ నగర్ సిటీ టైమ్స్ నవంబర్ 16
దళిత యువకుడిని దారుణంగా హింసించి చంపిన నిందితులను ఉరి తీయాలని యువ సత్తా అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు..నేటి సమాజం లో పరువు హత్యలు ఇప్పటికీ అక్కడ ఆక్కడ జరుగుతూనే ఉన్నయని... కారణం కటిన శిక్షలు లేక పోవడమే నని అన్నారు. షాద్నగర్ అత్యంత సమీపంలో ఇలాంటి దుర్ఘటన జరగడం శోచనీయమని అన్నారు. ఇలాంటి దారుణ సంఘటనలు జరుగకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలదే,,,,రాజశేఖర్ పేద కుటుంబన్నీ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలనీ ఆయన కోరారు

# గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టాలని ఎమ్మెల్యేకి వినతి



- సమస్యను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి.

పాలకుర్తి, (సిటీ టైమ్స్)
దేవరుప్పుల మండల ఆర్ఎంపీ,పిఎంపీ మండల వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు మేకపోతుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్య నారాయణ పాల్గొనగా ఆర్ఎంపీలపై టిజిఎంసి,ఐఎంఏ దాడులను అరికట్టాలని,గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యాన్ని అందిస్తున్న తమపై టిజీఎంసి,ఐఎంఏ దాడులు చేయడం సరికాదని,సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆర్ఎంపిలను ఆదుకోవాలని పాలకుర్తి మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినతి పత్రాన్ని పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డికి అందజేసిన ఆర్ఎంపి,పిఎంపీ గ్రామీణ వైద్యులు. ఈ కార్యక్రమంలో పాలకూర్తి నియోజక వర్గ ఆర్ఎంపీ,పిఎంపీ అధ్యక్షుడు లొంక మల్లేష్,ప్రధాన కార్యదర్శి కొంగ సతీష్, దేవరుప్పుల మండల ఉపాధ్యక్షుడు గుండు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సాదు రఘునాథ్ రెడ్డి, కర్రే శ్రీశైలం, పులిగిల్ల ఎల్లయ్య,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# అనాధల పట్ల తన గొప్ప మనసు ను చాటుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...



- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం...
- చేయూత అనాధాశ్రమానికి
- రూ .6 లక్షల విలువగల వాహన వితరణ చేసిన ఎమ్మెల్యే...
- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేసిన అన్నదాశ్రమ నిర్వాహకులు...

వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ నవంబర్ 16
ఆపద ఎవరిదైనా ముందుండి సేవ గుణంతో ఆదుకునే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అనాధలైన చిన్నారుల కోసం తన మానవత్వాన్ని మరోసారి సాటుకున్నారు..
వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు.. చిట్యాల చేయూత అనాధాశ్రమానికి తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు సాయి రెడ్డి, వెంకటమ్మ ల జ్ఞాపకార్థం రూ 6 లక్షల విలువ గల వాహనాన్ని అందించారు కన్నతల్లిదండ్రులను సరిగా చూసుకొని ఈరోజుల్లో తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆశ్రమానికి వాహనాన్ని అందించి ఎమ్మెల్యే తన గొప్ప మనసును చాటుకున్నారని చేయూత అనాధాశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి వాపోయారు చేయూత అనాధాశ్రమం నుంచి గ్రామాలలోని అనాధ వృద్ధులకు భోజనాన్ని అందించేందుకు ఈ వాహనాన్ని ఉపయోగించినట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు మానవత్వం గల ఇలాంటి గొప్ప నాయకులు కలకాలం ప్రజాసేవలోనే ఉండాలని వారు ఆకాంక్షించారు కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, చిన్నమందడి మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వారికి ఆదిత్య కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్, సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సిటీ టైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## అనాథల పట్ల తన గొప్ప మనసు ను చాటుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం
- చేయూత అనాధాశ్రమానికి
- రూ .6 లక్షల విలువగల వాహన వితరణ చేసిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేసిన అన్నదాశ్రమ నిర్వాహకులు

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ నవంబర్ 16**

ఆపద ఎవరిదైనా ముందుండి సేవ గుణంతో ఆదుకునే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అనాధలైన చిన్నారుల కోసం తన మానవత్వాన్ని మరోసారి సాటుకున్నారు.. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు.. చిట్యాల చేయూత అనాధాశ్రమానికి తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు సాయి రెడ్డి, వెంకటమ్మ ల జ్ఞాపకార్థం రూ 6 లక్షల విలువ గల వాహనాన్ని అందించారు కన్నతల్లిదండ్రులను సరిగా చూసుకొని ఈరోజుల్లో తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆశ్రమానికి వాహనాన్ని అందించి ఎమ్మెల్యే తన గొప్ప మనసును చాటుకున్నారని చేయూత అనాధాశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి వాపోయారు చేయూత అనాధాశ్రమం నుంచి గ్రామాలలోని అనాధ వృద్ధులకు భోజనాన్ని అందించేందుకు ఈ వాహనాన్ని ఉపయోగించినట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు మానవత్వం గల ఇలాంటి గొప్ప నాయకులు కలకాలం ప్రజా సేవలోనే ఉండాలని వారు ఆకాంక్షించారు కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, చిన్నమందడి మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వారికి ఆదిత్య కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్, సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## 17వ తేదీ నుంచి జీహెచ్ఎంసీ 'ప్రజావాణి' పునరుద్ధరణ

**హైదరాబాద్, నవంబర్ 16,(సిటీ టైమ్స్):**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 17వ తేదీనుంచి యథావిధిగా కొనసాగనుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

ఎన్నిక ముగిసినందున తిరిగి వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమంను జీహెచ్ఎంసీ పునరుద్ధరిస్తుంది.

## హోరాహోరీగా సాగుతున్న నెట్ బాల్ పోటీలు

**మహబూబాబాద్ జిల్లా (తొర్రూర్ )సిటీ టైమ్స్ నవంబర్ 17:-**

మండలంలోని గుర్తురు ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న నెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఎస్ జీ ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అండర్ -19 రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా ఆదివారం సెమీఫైనల్ పోటీలు నిర్వహించారు. ఖమ్మం, వరంగల్ జట్ల మధ్య, మహబూబ్ నగర్, హైదరాబాద్ జట్ల మధ్య పోటీ హోరా హోరీగా కొనసాగాయి. సెమీ ఫైనల్ పోటీల్లో భాగంగా ఆయా జట్ల క్రీడాకారులను ఎంఈఓ ఎం. బుచ్చయ్య, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావులు పరిచయం చేసుకున్నారు. అండర్ 19 కేటగిరీలో రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల జట్లకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. లీగ్ దశల్లో పలు మ్యాచ్ లలో గెలుపొంది ఖమ్మం, వరంగల్, మహబూబ్ నగర్, హైదరాబాద్ జట్లు సెమీ ఫైనల్ కు దూసుకు వచ్చాయి. సోమవారం వీటిలో గెలుపొందిన రెండు జట్ల నడుమ ఫైనల్ పోరు రసవత్తరంగా సాగనుంది. అదే రోజు విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్ ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు సమ్మయ్య, కోఆర్డినేటర్ పివి రమణ, ఎస్ జి ఎఫ్ ఐ సహాయకులు సిహెచ్ ఐలయ్య, ఫిజికల్ డైరెక్టర్లు కొప్పుల శంకర్, కె.ప్రభాకర్, వరప్రసాద్, జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తుమ్మ సురేష్, చంద్రబాను తదితరులు పాల్గొన్నారు.





# అన్నను బలికొన్న తమ్ముడి ప్రేమ..





- పరువు హత్య తో ఉలిక్కిపడ్డ షాద్ నగర్...

**షాద్ నగర్ సిటీ టైమ్స్ నవంబర్ 16..**

తమ్ముడి ప్రేమ తన అన్న పాలిట యమపాశంగా మారింది. తమ్ముడి ప్రేమ వివాహానికి అన్న బలైపోయిన సంఘటన ఫరూఖ్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పరువు హత్యతో షాద్నగర్ ఒకసారి ఉలికిపడింది. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన అమ్మాయిని ఎర్ర చంద్రశేఖర్ ఇంటి నుండి తీసుకెళ్లడానే కోపం తో అతని అన్న ఎర్ర రాజేశేఖర్ ని అమ్మాయి తండ్రి వెంకటేష్ మరి కొంతమంది తో కలిసి కిడ్నాప్ చేశారు. కిడ్నాప్ గురైనఎర్ర రాజేశేఖర్ ని మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట మండలం ఎన్మాన్ గండ్ల శివారు లో చంపి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ విషయం వెలుగు లోకి రావడం తో గ్రామం లో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది, ఎలాంటి ఘటనలు జరగకుండా గ్రామం లో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసారు. అబ్బాయి చంద్రశేఖర్ ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతుండగా అమ్మాయి భవాని డిగ్రీ చదువుతుంది, గతం లో ఇద్దరు ఒకసారి ఇంటి నుండి వెళ్ళిపోగా పోలీసులు కౌన్సిలింగ్ తో గొడవ సద్దుమణిగింది. ఈ నెల 12న

చంద్రశేఖర్, భవాని మరోసారి ఇంటి నుండి వేళ్లిపోయారు. దీంతో కోపం తో రగిలిపోయిన భవాని తండ్రి వెంకటేష్ చంద్రశేఖర్ అన్న రాజశేఖర్ ని 12న రాత్రి ఇంటి నుండి కిడ్నాప్ చేసి హతమార్చాడు. పరువు హత్యకు పాల్పడిన నియమితులను కఠినంగా శిక్షించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.







# అనాధలను చేరదీసి అన్నీ తానై చూసుకుంటున్న శ్రీనివాసరెడ్డి కృషి అభినందనీయం..



- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి..
- చిట్యాల అనాధాశ్రమంలో పెళ్లి
- హాజరై ఆశీర్వదించిన ఎమ్మెల్యే..

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ నవంబర్ 16..**

గత 25 సంవత్సరాల క్రితమే తల్లిదండ్రులు లేని అనాధలను చేరదీసి విద్యాబోధన చేయడంతో పాటు సొంత తల్లి తండ్రి మాదిరిగా వారు లేని లోటును మరిపించి పెంచి పెద్దగా చేసి పెళ్లిళ్లు చేస్తున్న చిట్యాల చేయుత అనాధ ఆశ్రమం నిర్వాహకులు విట్టా శ్రీనివాసరెడ్డి కృషి అభినందనీయమని వనపర్తి ఎమ్మెల్యే తడి మేఘారెడ్డి కొనియాడారు..

వనపర్తి మండలం చిట్యాల గ్రామ శివారులోని చేయూత అనాధాశ్రమంలో ఆదివారం నిర్వహించిన వివాహానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు 2004 సంవత్సరం అనాధగా ఆశ్రమంలో చేరిన మాధవి పెరిగి పెద్దదయింది ఈ క్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి దంపతులు అమ్మాయికి జటప్రోలు గోపులాపురం గ్రామానికి చెందిన సందీప్ రెడ్డి తో వివాహం నిర్వహించారు ఆదివారం అనాధాశ్రమం లో నిర్వహించిన ఈ వివాహానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు

అనాధలను చేరదీసి వారి బాగోగులు చూసుకుంటూ భవిష్యత్తు బాగును కోరి వివాహం జరిపిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి దంపతులను ఎమ్మెల్యే అభినందించారు కార్యక్రమంలో వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, చిన్నమందడి మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వారికి ఆదిత్య కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్, సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు _

# క్రీడల్లో గెలుపోటములు సహజం రెండిటిని సమానంగా తీసుకోవాలి





**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**

**వనపర్తి సిటీ టైమ్స్ నవంబర్ 16**

వనపర్తి జిల్లా చిట్యాల గ్రామ సమీపాన గల మహాత్మ జ్యోతిబాపూలే సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో అండర్ 14 ,అండర్ 17 స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు.విద్యార్థుల చేత గౌరవ వందనం స్వీకరించారు.

చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గం ఒక విద్య కే ప్రాముఖ్యం కాకుండా ఆటలకు ప్రాముఖ్యం గల నియోజకవర్గమని అన్నారు.క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని కూటమికి కుంగిపోకుండా మరింత శ్రమించి గెలుపు దిశగా అడుగులు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంప్రతిభవంతులైన క్రీడాకారులను వెలుగులోకి రావడానికి మంచి వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.క్రీడాకారులు దృఢంగా ,శక్తివంతంగా ఉండాలంటే పౌష్టికాహారం చాలా ముఖ్యమని ఆ విధంగా ఉండేందుకు రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచి క్రీడాకారులు దృఢంగా శక్తివంతంగా ఉండటానికి కృషి చేసిందని తెలిపారు.క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని విద్యార్థులకు సూచించారు.భవిష్యత్తు లో వనపర్తి నియోజకవర్గం నుంచి ఒలంపిక్స్ లో ఆడెందుకు విద్యార్థులను తీర్చిదిద్దాలని వ్యాయామ ఉపాధ్యాయులకు విజ్ఞపించారు.చిన్నారి రుద్రాణి కూచిపూడి నృత్యం ఆన్లైన్లో చూసి నేర్చుకొని చాలా చక్కగా చేసిందని భవిష్యత్తులో మంచి కూచిపూడి కళాకారుని కావాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వనపర్తిపట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల్ NSUI అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, ఎంట్ల రవి ,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.







## హరిత,పరిశుభ్ర హైదరాబాద్ నగరం కోసం
# జీహెచ్ఎంసీ హ్యాపీ స్ట్రీట్స్ కార్యక్రమం

**హైదరాబాద్, నవంబర్ 16,(సిటీ టైమ్స్):**
నగర ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం పరిశుభ్రమైన, హరిత వాతావరణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జీహెచ్ఎంసీ , పలు సంస్థలతో కలిసి సంజీవయ్య చిల్డ్రన్స్ పార్క్ వద్ద హ్యాపీ స్ట్రీట్స్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. "క్లీన్, గ్రీన్ హైదరాబాద్" అనే అంశంతో సాగిన ఈ కార్యక్రమంలో నగర పరిశుభ్రత, చెత్త నిర్వహణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్ పర్యావరణ పరిరక్షకులైన పిల్లల్లో అవగాహన పెంపు పై కార్యక్రమంలో ప్రత్యేక దృష్టి పెట్టారు.కార్యక్రమానికి ఖైరతాబాద్ జోన్ కమిషనర్ అనురాగ్ జయంతి హాజరై, నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో భాగస్వామ్యమైన వారితో "స్వచ్ఛ్ సిటీ హీరోస్ ప్రమాణం" చూపించారు. పిల్లలకు మొక్కలను పంపిణీ చేసి, హరిత హైదరాబాద్ నిర్మాణానికి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

# సోలిపూర్ రవీందర్ రెడ్డి కి మాతృవియోగం

### - పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ నవంబర్ 16**
మాజీ జెడ్పిటిసి సోలిపురం రవీందర్ రెడ్డి మాతృమూర్తి మృతి పరామర్శించి నివాళులు అర్పించారు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ..ఖిల్లా ఘణపురం మండలం సోలిపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి, సింగిల్ విండో మాజీ చైర్మన్ తేనేటి రవీందర్ రెడ్డి.జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి మాతృమూర్తి పద్మమ్మ శనివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదివారం ఉదయం వారి కుటుంబాన్ని పరామర్శించి పద్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారి తల్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు కార్యక్రమంలో ఖిల్లా ఘణపురం సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, వెంకట్రావు, గంజాయి రమేష్, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి మాజీ సర్పంచ్ సతీష్ఆగారం ప్రకాష్, శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు






# త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



### - కులాలు అహేతుకం మతాలు నిషిద్ధం


**కొత్తకోట సిటీ టైమ్స్ నవంబర్ 16:**
త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ, పెబ్బేరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా, కొత్త కోట మండలం లోని విలియం కొండ గ్రామంలో* త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానంను తెలియజేస్తుంది., ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నాము అని , మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలు గా విభజింపబడి ఉన్నాడని జీవాత్మ, ఆత్మ, పరమాత్మ ల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు, భగవద్గీత లో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయి అని తెలిపారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతంప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ , పెబ్బేరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు విజయ భాస్కర్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , బాలకృష్ణ, నరేందర్, పోతుల రాములు, జాంగిర్, వేణుగోపాల్, శంకరమ్మ, వెంకటమ్మ, శాంత, అనిత, రేవతి, మంజుల, ప్రబోధ, కృష్ణ కాంత్ పాల్గొన్నారు.

# సింగయ పల్లి లో సిగముగుతున్న రేషన్ బియ్యం దందా..!

### - ప్రభుత్వ ధాన్యం పక్కదారి ...
### - పోలీసుల కళ్ళు గప్పి రేషన్ దందా..
### - మామూ"లుగా" తీసుకుంటున్న సివిల్ సప్లై అధికారులు..?




**వనపర్తి క్రైమ్ సిటీ టైమ్స్ నవంబర్ 16**
వనపర్తి జిల్లా పరిధిలో నూతనంగా ఏర్పడిన ఏదుల మండలం సింగయ పల్లి గ్రామంలో అక్రమ రేషన్ బియ్యం తందా మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుందని గ్రామ శివారు సమీపంలోని ఒక రైస్ మిల్లులో రేషన్ దందా వ్యవహారం నిరంతరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది ప్రతినెల మూడవ తేదీ నుండి 25వ తేదీ వరకు పగలు రాత్రి అని తేడా లేకుండా ఉమ్మడి పాలమూరు జిల్లా నుండి పెద్ద ఎత్తున సంబంధిత రైస్ మిల్లుకు అక్రమంగా రేషన్ బియ్యం తరలివస్తుందనీ ఆటోలు. బొలెరో వాహనాలు డీసీఎంలలో రేషన్ బియ్యం ఇక్కడికి చేరుతున్న అటు పోలీస్ సిబ్బంది ఇటు సివిల్ సప్లై అధికారులు పట్టించుకోవడం లేదు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఇక్కడ రేషన్ బియ్యాన్ని పెద్ద ఎత్తున డంపు చేసి వనపర్తి. నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలో (కస్టమ్స్ మిల్లింగ్ రైస్) సీఎంఆర్ గోదాములకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది . సంబంధిత రైస్ మిల్లు లో యజమానులు 2024 25 రబీ సీజన్ కు సంబంధించి ఎక్కువగా ప్రభుత్వ వరి ధాన్యం దించుకోలేదు.. రైస్ మిల్లులో రేషన్ రీసైక్లింగ్ దందాను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ప్రభుత్వానికి బకాయి పడిన రైస్ మిల్లు ల పేర్ల మీద వనపర్తి నాగర్ కర్నూల్ జిల్లాలోని సివిల్ సప్లై గోదాములకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.. ప్రభుత్వం సంబంధిత రైస్ మిల్లు కు కేటాయించిన వరి ధాన్యం రైస్ మిల్లులో ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి ఉన్నది గతంలో సంబంధిత రైస్ మిల్లుకు వచ్చిన విద్యుత్ చార్జీలు మరియు సంబంధిత రైస్ మిల్లు పేరు మీద సివిల్ సప్లై గోదాం లో ఇచ్చిన సి ఎం ఆర్ బియ్యానికి టెక్నికల్ అధికారులు కెమికల్ టెస్టింగ్ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది...





## సేవా తరుణి
# ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**మహబూబాబాద్ జిల్లా (తొర్రూర్ )సిటీ టైమ్స్ నవంబర్ 17:-**
లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డయాబెటిక్ క్యాంప్ 9వ రోజు మండలంలోని చింతలపల్లి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.120 మందికి షుగర్ మరియు బిపి పరీక్షలు నిర్వహించి అనారోగ్యంతో మంచంపై ఉన్న వృద్ధులకు బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు.అనంతరం పేద కుటుంబాలకు రూ. 7400 విలువగల చీరలు, నిత్యవసర సరుకులు ,జ్యూట్ బ్యాగులను పంపిణీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జిఎల్టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరి శారద , ట్రెజరర్ లయన్ వేముల మంజుల, లయన్ ఉమా రెడ్డి, నిర్మల హాస్పటల్ సిబ్బంది లు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మాపురం లో పడిపూజ



**మహబూబాబాద్ జిల్లా (తొర్రూర్)సిటీ టైమ్స్ నవంబర్ 17:-**
తొర్రూర్ మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్ గౌడ్ రజిత దంపతుల ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా మహా పడిపూజ నిర్వహించారు గ్రామంలో తన ఇంటి వద్ద నూతన గృహ ప్రవేశం సందర్భంగా సంకీర్తనలు పూజలు హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించి గ్రామంలోని ప్రజలు సుఖ సంతోషాలతో తులతూగాలని నూతన గృహంలో హోమాలు పూజలు నిర్వహించి నూతన గృహ ప్రవేశం చేశారు. అయ్యప్ప భక్తులకు గ్రామ ప్రజలకు మహా అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అభివద్ధి కోసం తన వంతు సహాయం చేయడం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లో మాల ధారణ చేసిన అయ్యప్ప దీక్ష స్వాములు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బత్తుల మహేష్ యాదవ్ కు జన్మదిన అభినందనలవెల్లువ

**కొత్తకోట సిటీ టైమ్స్ నవంబర్ 16 :**
మదనాపురం మండలం కొన్నూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ మండల నాయకులు బత్తుల మహేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా మిత్ర బృందం శాల్వతో సన్మానించి కేక్ కట్ చేఇంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సూర్య పత్రిక జర్నలిస్ట్ రవీందర్ యాదవ్, ప్రేమ్ కుమార్ యాదవ్, వెంకటేష్ యాదవ్, బాలరాజ్ యాదవ్, మధ్యమోని రాము యాదవ్ పాల్గొన్నారు.



సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com

# తగ్గేదేలే అంటున్న తిరువీర్

జార్జిరెడ్డి, టక్ జగదీశ్, పరేషాన్, మసూద సినిమాలతో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు తిరువీర్. ఇటీవలే ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నాడు. ఈ మూవీ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న తిరువీర్ భరత్ భూషణ్ డైరెక్షన్‌లో సినిమా లాంచ్ చేశాడని తెలిసిందే. ఈ సినిమా ఇటీవలే హైదరాబాద్‌లో గ్రాండ్‌గా మొదలైంది. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్న ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం నవంబర్ 19 నుంచి సెట్స్‌పైకి కూడా వెళ్లనుంది. కాగా ఇప్పుడు తిరువీర్‌కు సంబంధించిన మరో సినిమా వార్త టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లకముందే మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు డైలాగ్ రైటర్ కృష్ణ చేపూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా ఫైనల్ అయిందట. బేబితో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న శ్రీనివాస్ కుమార్ (ఎస్‌కేఎన్) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డ్రాగన్, డ్యూడ్ సినిమాలకు పనిచేశాడు కృష్ణ చేపూరి. ఇంకా టైటిల్ కాని ఈ ప్రాజెక్ట్ షూటింగ్ దశలో ఉన్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి సైలెంట్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ఓకే చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు తిరువీర్.



# దేశంలో సగం మంది నన్ను చంపాలనుకున్నారు

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ . ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ'. 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయ రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. "రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు" అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. "పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుంది" అని అదా శర్మ చెప్పారు.



# రషి.. నిన్ను చూస్తే గర్వంగా ఉంది

"అందరం తప్పులు చేస్తాం. ఎవరూ పరిపూర్ణం కాదు. మగాళ్లు వాళ్ల భాగస్వామికి ఎప్పుడూ రక్షణగా ఉండాలనుకుంటారు. అయితే ఆ రక్షణ వాళ్లపైన నియంత్రణలా ఉండకూడదు. వాళ్ల సంతోషాన్ని, వాళ్ల కలల్ని రక్షిస్తున్నట్టుగా ఉండాలి" అన్నారు ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన ముఖ్య అతిథిగా బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'ది గర్ల్‌ఫ్రెండ్' విజయోత్సవం జరిగింది. రష్మిక ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పకులు. విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మాతలు. విజయోత్సవాన్ని ఉద్దేశించి విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ఈ సినిమా నన్ను ఎంతో భావోద్వేగానికి గురిచేసింది. చాలా చోట్ల కన్నీళ్లు ఆపుకోవల్సి వచ్చింది. చాలా చోట్ల బరువుగా, అసౌకర్యంగా అనిపించింది. చివరికి ఒక సంబరంలా అనిపించింది.



ఈమధ్యకాలంలో నేను చూసిన అత్యుత్తమ సినిమా ఇది. రష్మిక భూమాదేవినే. అందరూ సంతోషంగా ఉండాలని తపించే వ్యక్తిత్వం తనది. ఒక మహిళగా ఇప్పుడు తన కథల ఎంపిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. రషి నీ కెరీర్ విషయంలో గర్వపడుతున్నా" అన్నారు. రష్మిక మాట్లాడుతూ "ఈ కథ విన్నప్పుడు ఈ సినిమానే మొదట చేయాలనిపించింది. భూమా జీవితంలో జరిగినట్టుగానే నా జీవితంలోనూ కొన్ని జరిగాయి. కానీ ఇప్పుడు అర్థమవుతోంది అందరి జీవితంలోనూ ఇలాంటివి జరిగాయని. అందరూ ఈ సినిమాకి కనెక్ట్ అవుతున్నారు. అదే నాకు పెద్ద పురస్కారం. విజ్జూ (విజయ్ దేవరకొండ) ఈ సినిమా ప్రారంభం నుంచి భాగం అయ్యారు. విజయోత్సవంలోనూ తను ఉండటం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక విజయ్ దేవరకొండ ఉండాలి. అది ఒక వరం" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ సినిమాకి హీరో దర్శకుడు. మగవాళ్లూ ఈ సినిమాని మెచ్చుకునేలా తీశాడు.



# ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే అందుకే భయం

అగ్ర కథానాయిక రష్మిక ప్రస్తుతం సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఆమె నటించిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' ఆదరణను సొంతం చేసుకుంది. అయితే, ఈ సినిమా ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఒక షోలో రష్మిక చేసిన కామెంట్స్ వైరల్ అయిన విషయం తెలిసిందే. మగవాళ్లకు కూడా జీవితంలో ఒకసారి పీరియడ్స్ రావాలని అప్పుడే ఆడవాళ్లు పడే బాధ అర్థం అవుతుందని ఆమె అన్నారు. ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ కావడంతో తాజాగా ఆమె తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. "ఈ విషయం గురించి ఎవరూ మాట్లాడరు. షోలు, ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే నాకు అందుకే భయం. నేను ఒక ఉద్దేశంతో మాట్లాడితే.. దాన్ని మరోలా అర్థం చేసుకుంటున్నారు. పూర్తి భిన్నంగా అర్థం చేసుకుంటున్నారు" అని అన్నారు. రష్మిక కామెంట్స్‌కు ఆమె అభిమానులు మద్దతు తెలుపుతున్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు మొత్తం షేర్ చేయకుండా సగం మాత్రమే కట్ చేసి షేర్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేస్తున్నారు. పీరియడ్స్ సమయంలో తాను భయంకరమైన నొప్పిని అనుభవిస్తానని రష్మిక తెలిపారు. "నేను ప్రతినెల ఈ నొప్పిని భరిస్తాను. ఒకసారి స్పృహ తప్పి పడిపోయాను. వైద్యుల దగ్గరకు వెళ్లి అన్ని చెకప్‌లు చేయించుకున్నాను. కానీ, వాళ్లు కూడా ఇది సాధారణమని చెప్పారు. 'దేవుడా ఎందుకు నన్ను ఇంత బాధ పెడుతున్నావు' అని ప్రతి నెలా అనుకుంటాను.

# తోట తరణికి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం

కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లో అందించిన విశిష్ట సేవలకుగాను ఫ్రాన్స్ ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం 'చెవాలియర్'కు ప్రముఖ కళాదర్శకుడు తోట తరణి ఎంపికయ్యారు. గురువారం చెన్నైలోని అలయన్స్ ఫ్రాన్స్ ప్రాంగణంలో జరగనున్న కార్యక్రమంలో భారతదేశంలోని ఫ్రాన్స్ దేశపు దౌత్యాధికారి ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తోట తరణి చిత్రలేఖన ప్రదర్శన శుక్రవారం వరకు కొనసాగనుంది. చెవాలియర్ పురస్కారం అందుకోనుండటం చాలా సంతోషంగా ఉందని తోట తరణి హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ 'ఎక్స్' పేజీ ద్వారా అభినందనలు తెలిపారు. గతంలో దిగ్గజ నటుడు దివంగత శివాజీ గణేశన్ (1995), కమల్‌హాసన్ (2016) లాంటివారు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తోట తరణికి అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు అగ్ర కథానాయకుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. పవన్ నటించిన హరిహర వీరమల్లు చిత్రానికి తోట తరణి కళా దర్శకత్వం వహించారు.



Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**